క్లుప్తంగా

ఘనంగా అలుకుల సంబరం



రంగాపురంలో అలుకులు గుచ్చుకున్న కరికాల భక్త యువకులు

అమలాపురం రూరల్: రంగాపురం, ఇమ్మిడివరప్పాడు గ్రామాల్లో కరికాల భక్త యువజన సంఘం ఆధ్వర్యంలో వీరభద్రుని అలుకుల సంబరం శనివారం ఘనంగా నిర్వహించారు. కరికాల భక్త యువజన సంఘానికి చెందిన యువకులు ఉదయం నుంచి అలుకులు గుచ్చుకుని శూలాధారులై భక్తితో ట్రాక్టర్లపై ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలతో వీరభద్రుని ప్రభను ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు వీరభద్రుని దర్శించుకున్నారు.

ఇస్కాన్ ఆధ్వర్యంలో వితరణ



ఇస్కాన్‌చే ఏర్పాటైన మహా అన్న ప్రసాద వితరణ

అమలాపురం టౌన్: మహాశివరాత్రి సందర్భంగా స్థానిక మాచిరాజు వీధిలోని ఇస్కాన్ అవుట్ పోస్ట్ సెంటర్ ఆధ్వర్యంలో ముక్తేశ్వరం, కోటిపల్లి ప్రాంతాల గౌతమీ నదీ గట్లపై ఉచిత మందుల(మెడికల్) శిబిరం, బుక్ స్టాల్, మహా అన్న ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు శనివారం చేపట్టారు. ఏటా మహాశివరాత్రి వేళ భక్తులకు ఉచిత సేవలు అందించడం ఇస్కాన్ ఆనవాయితీ అని అమలాపురం సెంటర్ కో ఆర్డినేటర్ శివానంద నిమయిదాస్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వీరవల్లిపాలెం, ముక్తేశ్వరం, కోటిపల్లి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వికాస ఆధ్వర్యంలో జాబ్ డ్రైవ్‌లు

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయం ఆధ్వర్యాన జిల్లాలోని వివిధ ప్రైవేట్ కళాశాలల్లో జాబ్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్లు వికాస జిల్లా మేనేజర్ గోళ్ళ రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన కాట్రేనికోన సిద్దార్థ డిగ్రీ కళాశాలలో, 23న అమలాపురం ఎర్రవంతెన వద్ద ఉన్న డిగ్రీ కళాశాలలో, 24న తాటిపాక వేద డిగ్రీ కళాశాలలో, 25న అల్లవరం రవితేజ డిగ్రీ కళాశాలలో, 28న ఐ.పోలవరం శకుంతల దేవి డిగ్రీ కళాశాలలో డెక్కన్ కెమికల్స్, ఎన్‌ఐబీటీ ఐసీఐసీఐ బ్యాంక్, ఐ టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని చెప్పారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ రమేష్ కోరారు. మరిన్ని వివరాలకు 79890 57588 ఫోన్ నెంబర్‌కు సంప్రదించొచ్చన్నారు.

విలసవిల్లిలో ఘనంగా సహస్ర లింగార్చన



విలసవిల్లిలో నవగ్రహ నక్షత్ర పూజల్లో యాగం చేస్తున్న పండితులు

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి రామాలయంలో జరుగుతున్న నవగ్రహ నక్షత్ర మహా సౌరయాగంలో 28వ రోజు శివరాత్రి సందర్భంగా సహస్ర లింగార్చన ఘనంగా నిర్వహించారు. యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో శనివారం జ్యోతిలింగార్చన, చండీహోమం, సూర్యనమస్కారాలు, సౌర అష్టాక్షరి జపాలు జరిపారు. ఉత్తారాషాడ నక్షత్ర జాతకులచే పనస చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పుదుచ్చేరి స్టేట్ బెస్ట్ చైల్డ్ అవార్డులకు ఎంపిక

యానాం: పుదుచ్చేరి స్టేట్ బెస్ట్ చైల్డ్ అవార్డుల జాబితాను శనివారం విద్యాశాఖ విడుదల చేసిందని ప్రాంతీయ విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్ తెలిపారు. యానాం రీజియన్‌లో 2022 సంవత్సరానికి గాను రీజెన్సీ కళాశాల విద్యార్థిని మాగాపు దీపిక(క్రియేటివ్ రైటింగ్), 2021 సంవత్సరానికి శారదా విద్యానికేతన్ ప్రభుత్వ ఎయిడెడ్ హైస్కూల్ విద్యార్థిని కేఆర్ఆర్ఎల్‌డీ శేషిత(క్రియేటివ్ ఆర్ట్), 2020 సంవత్సరానికి గాను రీజెన్సీ కళాశాల విద్యార్థిని టి.లక్ష్మీమాధవి(క్రియేటివ్ రైటింగ్) ఎంపికయ్యారన్నారు. వారికి మార్చి నెలలో పుదుచ్చేరి బాల భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఎల్జీ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా రూ.5 వేల నగదు, ప్రశంసాపత్రాల్ని ప్రదానం చేస్తారన్నారు. విజేతలను రీజెన్సీ ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్, బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు అభినందించారు.



మురమళ్ల వీరేశ్వరుని దర్శించుకున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్



మురమళ్ల వీరేశ్వరస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న పండితులు



అమలాపురంలో ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను దర్శించుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి



నడిపూడి విశ్వేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

హరహర మహాదేవ.. శంభో శంకర..

- వైభవంగా మహాశివరాత్రి వేడుకలు
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

ఐ.పోలవరం: హర హర మహాదేవ.. శంభో శంకర.. ఓం నమః శివాయ.. అంటూ భక్తుల శివ పంచాక్షరి నామస్మరణతో మండలంలోని శైవ క్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునే వృద్ధ గౌతమీ గోదావరి నదుల్లో స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద పెద్ద ఎత్తున బారులు తీరారు. ఈ సందర్భంగా పరమశివునికి నమక చమకాలతో విశేష అభిషేకాలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. ప్రసిద్ధ క్షేత్రమైన మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి దర్శనానికి సుమారు కిలో మీటరు మేర భక్తులు బారులు తీశారు. స్థానిక హైస్కూల్ సెంటర్‌లో భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామికి ద్వాదశ పుష్కర నదీజాలాభిషేకం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు ఏర్పాట్లును పర్యవేక్షించారు. స్వామి వారిని స్థానిక ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దంపతులు, అమలాపురం ఆర్డీఓ వసంత రాయుడు దర్శించుకున్నారు.

అమలాపురం టౌన్: అమలాపురం మెయిన్ రోడ్డులోని పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో శివ లింగాన్ని భక్తులు తాకి దర్శనం చేసుకునే వెసులుబాటు ఉండడంతో శనివారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. సాయంత్రం అఖండ దీపారాధనలో వేలాది మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. రాత్రి 9.30 గంటల నుంచి బాణసంచా కాల్పులు అమలాపురంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పురాతన శివ క్షేత్రమైన స్థానిక చెన్న మల్లేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, నాగ లింగేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.



మురమళ్ల వీరేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు

ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాల ప్రదర్శన

అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గరిగుంట చెరువువద్ద ఉన్న ఓం శాంతి భవనంలో దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను శివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ప్రారంభించారు. ఓం శాంతి కేంద్ర ఇన్‌చార్జి బీకే శ్రీదేవి ఆధ్వర్యంలో నమూనాలు ఏర్పాటయ్యాయి.

అమలాపురం రూరల్: నడిపూడి గ్రామంలో అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయానికి భక్తులు బారులు తీరారు. రోళ్లపాలెంలో అమలేశ్వరస్వామి, బండారులంకలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాల్లో స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది.



అమలాపురం సిద్ధేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం

ముమ్మిడివరం: పరమశివునికి అత్యంత ప్రీతికరమైన మహాశివరాత్రి పర్వదినాన్ని శనివారం ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి, కొమానపల్లి పార్వతీ సమేత చోడేశ్వర, లోకేశ్వరస్వామి, అయినాపురం ఉమా సోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతి గౌతమేశ్వరస్వామి తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తాళ్లరేవు: మండలంలోని చంద్ర ప్రతిష్ఠిత లింగమైన చొల్లంగి రాజరాజేశ్వరి సహిత సోమేశ్వరస్వామి, తాళ్లరేవు, సుంకరపాలెం భద్రకాళీ సమేత వీరేశ్వరాలయాలు, పిల్లంక, పటవలలో ఉన్న కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వరస్వామి, నీలపల్లి నీలకంఠేశ్వరస్వామివారి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యానాం: యానాంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్థానిక గౌతమీ తీరంలో శివమ్‌బాత్ వద్ద భక్తులు అభిషేకాలు నిర్వహించారు. యానాం బైపాస్‌సెంటర్‌లో కొలువైన పుట్ట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి సందర్భంగా ఏకరుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు.

కాట్రేనికోన: మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని కుండలేశ్వరం శివాలయంలో రాష్ట్రమంత్రి పినిపే విశ్వరూప్, బేబి మీనాక్షి దంపతులు, మగసానితిప్పలలో డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా దంపతులు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ దంపతులు కాలభైరవస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గొల్లవిల్లి శివాలయంలో మంత్రి, ఎంపీ ప్రత్యేక పూజలు

ఉప్పలగుప్తం: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని శివాలయాల్లో శనివారం మహాశివునికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గొల్లవిల్లి మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ దంపతులు, పార్లమెంటు సభ్యురాలు చింతా అనురాధ హాజరై స్వామిని దర్శించుకున్నారు. అనంతరం శివరాత్రి సందర్భంగా వార్షిక అన్నదానం చేస్తున్న పోలిశెట్టి భాస్కరరావును ఎంపీ అనురాధ దుశ్శాలువాతో సత్కరించారు. వానపల్లిపాలెం, విలసవిల్లి గ్రామాల్లో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.



గొల్లవిల్లి శివాలయంలో స్వామిని దర్శించుకుంటున్న మంత్రి విశ్వరూప్ దంపతులు



గొల్లవిల్లిలో భీమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎంపీ అనురాధ



ముమ్మిడివరం ఉమాసూరేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు



నీలపల్లిలో దీపారాధన చేస్తున్న భక్తులు



యానాం శివాలయం వద్ద దర్శనానికి బారులు తీరిన భక్తులు



అమలాపురంలో పురాతన శివక్షేత్రం చెన్న మల్లేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

విశ్వ బ్రాహ్మణ సంఘ ప్రతినిధులకు సత్కారాలు

అమలాపురం టౌన్: అయినవిల్లి మండల విశ్వ బ్రాహ్మణ సంఘం ఏర్పడి 40 ఏళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వీరబ్రహేంద్రస్వామి ఆలయం వద్ద సంఘ ప్రతినిధుల్ని జిల్లా సంఘం తరఫున శనివారం సత్కరించారు. శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని అయినవిల్లి సంఘ సభ్యులకు సత్కారాల అనంతరం స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా అయినవిల్లి మండల అధ్యక్షుడు దేవాదుల బాబ్జి, ప్రధాన కార్యదర్శి సింహాద్రి ప్రసాద్, ఉపాధ్యక్షుడు నాదెళ్ల నాగేశ్వరరావు, సభ్యులను జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్నయ్యదాసు, జిల్లా క్రమశిక్షణ కమిటీ చైర్మన్ తాళాబత్తుల చినబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు తాళాబత్తుల లక్ష్మణరావు, భరణికాన బాబు తదితరులు ఘనంగా సత్కరించారు.



వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

తాటాకిల్లు దగ్ధం

అల్లవరం: సామంతకుర్రు పంచాయతీ అంబేడ్కర్ నగర్‌లో నక్కా ధనలక్ష్మికి చెందిన తాటాకిల్లు శనివారం ఉదయం అగ్ని ప్రమాదానికి గురైంది. శనివారం ఉదయం 6 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకింట్లో మంటలు చెలరేగాయని స్థానికులు తెలిపారు. శివరాత్రి కావడంతో ధనలక్ష్మి తన కుమారుడు వీరబాబుతో కలిసి తెల్లవారుజామునే స్వామిని దర్శించుకునేందుకు శివాలయానికి వెళ్లారు. వారు తిరిగొచ్చేసరికి తాటాకిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పక్కా ఇంటి నిర్మాణం కోసం కూడబెట్టిన రూ.2.30 లక్షల నగదు మంటల్లో కాలిపోయిందని, కట్టుబట్టలు మినహా ఏమి మిగల్లేదని బాధితులు కన్నీరుమున్నీరవుతున్నారు. సుమారు రూ.4 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అగ్ని ప్రమాద బాధితులను సర్పంచ్ సుందరనీడి సాయి, ఎంపీటీసీ కర్రి సత్యశ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు చెదళ్ల వాసుదేవుడు తదితరులు పరామర్శించారు.



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటాకిల్లు

ఘనంగా ఆయుష్ హోమం



ఆయుష్ హోమం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

అంబాజీపేట: కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ పుట్టినరోజును పురస్కరించుకుని పుల్లేటికుర్రు బాలా త్రిపుర సుందరి సమేత అభినవ వ్యాఘ్రేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆయుష్ హోమం శనివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు పుల్లేటికుర్తి లింగమూర్తి, వెలవలపల్లి వ్యాఘ్రేశ్వర శర్మ ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. ఏకాదశ రుద్రుల ఆలయాలైన వ్యాఘ్రేశ్వరం, కె.పెదపూడి, గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రు, వక్కలంక, నేదునూరు, ముక్కామల, మొసలపల్లి, పాలగుమ్మి ఆలయాల్లో విజయేంద్ర సరస్వతి పేరున ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

ఎరుపు రంగు కార్డుకి అర్హుల వివరాలు సేకరిస్తున్నాం

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో ఎరుపు రంగు కార్డుకి అర్హుల వివరాలు సేకరిస్తున్నామని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అల్పాదాయ వర్గాలు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు అత్యధిక సంఖ్యలో ఉన్నా వివిధ ప్రభుత్వ పథకాలు వర్తించే ఎరుపురంగు కార్డులు మంజూరు చేయకుండా కేవలం ఏ పథకాలు వర్తించని పసుపు రంగు కార్డు(ఏపీఎల్) ఇచ్చి సివిల్ సప్లయిస్ శాఖ నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. పుదుచ్చేరి నుంచి ఉన్నతాధికారులు మాట్లాడి ఎరుపు రంగు కార్డుకు అర్హులైన వారి జాబితాను పంపాలని స్థానిక సివిల్ సప్లయిస్ అధికారులను కోరారని, అయితే ఎవరూ అర్హులు లేరని తెలపడం ఎంతవరకు సమంజమన్నారు. అందుకే తాను ఎరుపురంగు కార్డుకు అర్హులైనవారి వివరాలను సేకరిస్తున్నానని, త్వరలో వాటిని ఎల్జీ వద్దకు తీసుకువెళతానని తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేర్చడమే లక్ష్యం


- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు అవగాహన సదస్సు

అంబాజీపేట: కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ కో ఆప్షన్ సభ్యులు పి.కె.రావు కొబ్బరి గొడౌన్ వద్ద వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు అధ్యక్షతన గ్రామ సచివాలయ కన్వీనర్లకు, కార్యకర్తలకు మార్చి 18వ తేదీ నుంచి నిర్వహించే జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులైతే గృహసారథులు పార్టీకి ప్రజలకు మధ్య వారధులన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయో లేదా సమీక్షించడంతో పాటు పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలుంటే అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గృహ సారధులు ఇంటింటికి వెళ్లినప్పుడు వారి అనుమతితో సెల్‌ఫోన్, ఇంటి గోడపై «మా నమ్మకం నువ్వే జగన్‌» స్టిక్కర్లు వేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, సొసైటీ అధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, అప్పన శ్రీను, కుసుమ శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసులు తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేతలతో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లి: ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం పాలిటెక్నిక్ కళాశాలలో నాలుగు రోజులుగా అప్పారి నాగభూషణం మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు విజేతలైన ముక్తేశ్వరం జయంతి రామయ్య పంతులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టుకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల రెసిడెన్షియల్ డైరెక్టర్ కుమారస్వామి, తదితరులు ఉన్నారు

శనైశ్చర క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట: మహాశివరాత్రి, శని త్రయోదశి పర్వదినం సందర్భంగా కొత్తపేట మండలం మందపల్లి ఉమామందేశ్వర(శనైశ్చర) క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శనివారం, త్రయోదశి తిథి కలిసి రావడం (శనిత్రయోదశి)తో పాటు ఈసారి అమావాస్య ముందు శనిత్రయోదశి, ఇదే రోజు మహాశివరాత్రి కావడం విశేషం. శనిదోష నివారణకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఈ శనైశ్చర క్షేత్రానికి భక్తులు తరలివచ్చారు. శుక్రవారం రాత్రి నుంచి మందపల్లికి భక్తుల రాక ప్రారంభమై తెల్లవారే సరికి క్రమేపీ అత్యధిక సంఖ్యలో పెరిగిపోయిన భక్తజనంతో మందపల్లి క్షేత్రం కిటకిటలాడింది. భక్తులు సౌకర్యార్థం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు ఆర్డీఓ ఎం.ముక్కంటి, దేవదాయ- ధర్మదాయ శాఖ డీసీ ఎం.విజయరాజు పర్యవేక్షణలో అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ, అంతర్వేది దేవస్థానం ఈఓ, శనైశ్చర క్షేత్రం సీఎఫ్ఓ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఆలయ ప్రాంగణం, ఆలయం వెలుపల, వెనుక పూజల ప్రాంగణం అంతా 5 చోట్ల పూజలు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామివారి తైలాభిషేకానికి నాలుగు క్యూ లైన్లలో భక్తులు బారులు తీరారు. స్థానిక డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, కొత్తపేట ఎస్సై వి.మణికుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



మందపల్లి కాలువ రేవులో స్నానాలు చేస్తున్న భక్తులు

అబ్బురపరిచిన బాల అర్చకుడు

అంబాజీపేట: హిందూ సంస్కృతి సాంప్రదాయాలపై ఎంతో ఆసక్తి కలిగి, పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ బుడతడు అర్చక స్వామి అవతారమెత్తాడు. మహాశివరాత్రి సందర్భంగా పుల్లేటికుర్రు శివాలయంలో ఉన్న శ్రీ రమా సత్యనారాయణ స్వామి ఆలయంలో వెలవలపల్లి అభిరామ్ భక్తులకు ఆశీస్సులు అందించారు.



భక్తులకు ఆశీస్సులు అందజేస్తున్న అభిరామ్

సకాలంలో బిల్లులు చెల్లించండి

మలికిపురం: ఇచ్చిన 14 రోజుల్లోపు విద్యుత్ బిల్లులు చెల్లించి, అపరాధ రుసుం మినహాయింపు పొందాలని మలికిపురం విద్యుత్ శాఖ ఏఈ మద్దూరి సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామ సచివాలయాల్లో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులు బాటు కల్పించారన్నారు.